క్లుప్తంగా

మూడు మండలాల్లో సర్వేయర్లు మార్పు

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాలకు సంబంధించిన సర్వేయర్లను బదిలీ చేస్తూ ఇటీవల ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మేడిపల్లి మండలానికి చెందిన వెంకన్నను బాచుపల్లి మండలానికి, కుత్బుల్లాపూర్ మండల కార్యాలయంలో పనిచేస్తున్న సున్నితను దుండిగల్‌కు, ఘట్‌కేసర్‌లో పనిచేస్తున్న జగదీష్‌ను కుత్బుల్లాపూర్‌కు బదిలీ చేయగా సోమవారం వారు విధుల్లోకి హాజరయ్యారు. ఈ మూడు మండలాలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోనివే కావడం విశేషం.

హుండీ ఆదాయం లెక్కింపు



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టపై ఉన్న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఆలయ కమిటీ సమక్షంలో హుండీ డబ్బులు లెక్కించారు. 6 నెలలుగా హుండీ ద్వారా రూ.3,04,645 వచ్చాయని తెలిపింది. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులతో సహా ఈఓ పాల్గొన్నారు.

వైభవంగా ప్రవేశద్వార ప్రతిష్ఠాపనోత్సవం



నిజాంపేట్: బాచుపల్లి కౌసల్య కాలనీలోని శ్రీవెంకటేశ్వర శివరామ ఆలయంలో సోమవారం ప్రవేశద్వార ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, 17వ డివిజన్ కార్పొరేటర్ ఆగం రాజుముదిరాజ్, ఆగం లక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్ ఆగం పాండుముదిరాజ్, డివిజన్ బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ బద్రి, చందు, సుబ్బారావు, వెంకట్రావు, శర్మ దంపతులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఉస్మానియాయూనివర్సిటీ:ఓయూలో పీహెచ్‌డీ నోటిఫికేషన్ పడకేసింది. గత నెల 17న కేటగిరి-1 పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడగా కేటగిరి-2 ప్రవేశాలకు 21న ప్రకటన విడుదల కానున్నట్లు ప్రకటించారు. కానీ ఇంత వరకు కేటగిరి-2 నోటిఫికేషన్‌ను విడుదల చేయలేదు. అధ్యాపకుల కొరతతో ప్రతి ఏటా పీహెచ్‌డీ ప్రవేశాల సంఖ్య తగ్గుతోంది. మాజీ వీసీ ప్రొ.తిరుపతిరావు హయాంలో నాలుగు వేల మంది విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించగా అధ్యాపకుల కొరత కారణంగా ప్రస్తుతం 400 మందికి మాత్రమే పీహెచ్‌డీ చదివే అవకాశం లభిస్తుంది.

ఐటీఐలో 11న జాబ్‌మేళా

మేడ్చల్: ఈ నెల 11న మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. జాబ్‌మేళాతో పాటు అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పలు బహుళజాతి కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరవుతారని, ఐటీఐ ఉత్తీర్ణత చెందిన యువకులు ఉద్యోగావకాశాల కోసం మేళాకు హాజరు కావాలని ఆమె కోరారు.

అక్షరాస్యతలో శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: విభిన్న నేపథ్యాలు కలిగిన మహిళలకు అండదండలు అందించే లక్ష్యంతో వై4డీ ఫౌండేషన్‌తో కలిసి ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీ హిందుస్థాన్ కోకోకోలా బెవరేజస్ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత అందించనున్నామని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. నగరంతో సహా దేశ వ్యాప్తంగా 25వేల మందికి శిక్షణ అందించనున్నామన్నారు.

త్రిముఖ పోటీ తప్పదా?

- కూన శ్రీశైలంగౌడ్ చేరికతో పెరిగిన బీజేపీ బలం
- గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య గట్టి పోటీ
- కాంగ్రెస్‌లోకి మైనంపల్లి వస్తారంటూ ప్రచారం
- ఈ ముగ్గురు పోటీలో దిగితే ఫలితాలు తారుమారయ్యే అవకాశం

రసవత్తరంగా కుత్బుల్లాపూర్ రాజకీయం!


కేపీ వివేకానంద్


కూన శ్రీశైలంగౌడ్


మైనంపల్లి హనుమంతరావు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. మంత్రి హరీష్ రావుపై ఘాటైన వ్యాఖ్యలు చేసిన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఈ ప్రాంతం నుంచి పోటీ చేసే ఆలోచన ఉన్నట్లు పుకార్లు షికార్లు చేయడంతో ఒక్కసారిగా ఈ విషయం హాట్ టాపిక్‌గా మారింది.

◆ నిన్న మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీలో తనకు టికెట్ వస్తుందంటే.. తనకే వస్తుందని సుమారు 12 మంది కాంగ్రెస్ అధిష్ఠానానికి దరఖాస్తులు చేసుకోగా మైనంపల్లి కాంగ్రెస్ పార్టీలో చేరి కుత్బుల్లాపూర్‌పై పట్టు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు అన్నది సమాచారం.

◆ నియోజకవర్గంలోని కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లిలో ఉండే మైనంపల్లి ఈ ప్రాంత స్థానికుడు. ఇదే క్రమంలో అటు కొంపల్లి ఇటు గ్రేటర్ పరిధిలోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు టికెట్లు ఇప్పించుకొని గెలిపించుకున్నారన్న ప్రచారం ఉంది.

◆ ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే ఆలోచనలో ఉన్న మైనంపల్లి తన అనుచరులుగా ఉన్న కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లకు ఐదుగురు కార్పొరేటర్లతో ఇప్పటికే ప్రత్యేకంగా సమావేశమై ఇదే విషయంపై చర్చించినట్లు సమాచారం. వారి నుంచి సంపూర్ణ మద్దతు రావడంతో ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి అభ్యర్థిగా మైనంపల్లి బరిలో ఉంటారనే ప్రచారం జరుగుతోంది.

ఇద్దరికీ టికెట్ల హామీతో పార్టీ చేంజ్...!

◆ మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బీఆర్ఎస్ పార్టీపై తిరుగు బావుట ఎగిరివేయడంతో ఆ పార్టీ ఆచితూచి అడుగులు వేస్తూ పొమ్మనలేక పొగ పెడుతున్నారన్న ప్రధాన ఆరోపణ. మైనంపల్లి మంత్రి హరీష్‌పై వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఇప్పటి వరకు పార్టీ అధిష్ఠానం ఆయనను సంప్రదించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తూ రావడంతో ఇక పార్టీ మారడమే తరువాయి అన్నట్లుగా మైనంపల్లి వర్గీయులు ప్రచారం చేస్తున్నారు.

◆ దీంతో బీఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి బరిలో ఉంటారన్నది ప్రధాన టాక్. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతో మైనంపల్లి హనుమంతరావు ఇప్పటికే చర్చలు జరిపి కుమారుడికి మల్కాజిగిరి, మెదక్ రెండు నియోజకవర్గాల్లో ఏదో ఒకటి.. తాను కుత్బుల్లాపూర్ నుంచి పోటీ చేసే ఆలోచన ఉన్నట్లు వారికి తెలిపినట్లు సమాచారం. ఈ విషయంపై కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇప్పటికే మైనంపల్లి అనుచరులుగా కొనసాగుతున్న పలువురు చాపకింద నీరుల ప్రచారం మొదలుపెట్టడం విశేషం.

మారుతున్న రాజకీయ సమీకరణాలు..

◆ కుత్బుల్లాపూర్ రాజకీయం రసవత్తరంగా మారనుంది. ఒకవైపు మైనంపల్లి మరోవైపు కూన శ్రీశైలం గౌడ్.. ఇంకోవైపు సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద పోటీలో ఉంటారు అన్నది గట్టి ప్రచారం. దీంతో ఈ ప్రాంతంలో రాజకీయం రసవత్తరంగా మారే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

◆ గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీ నడుస్తూ వచ్చేది.. మారుతున్న రాజకీయ సమీకరణలో భాగంగా 2018లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కూన శ్రీశైలంగౌడ్ బీజేపీలో చేరగా ఇప్పుడు కొత్తగా మైనంపల్లి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేస్తే ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొనే అవకాశం ఉంది. దీంతో రాజకీయం ఇక్కడ రసవత్తరంగా జరిగే అవకాశం ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే మైనంపల్లికి స్థానిక నాయకత్వం పని చేస్తుందా.! లేదా అన్నది ఇప్పుడు చర్చగా మారింది.

కోట్లాది రూపాయలతో..
అభివృద్ధి పనులు చేపట్టాం

- ఎమ్మెల్యే వివేకానంద్


ఎమ్మెల్యేకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ తీర్మాన కాపీని అందజేస్తున్న బస్తీవాసులు

కుత్బుల్లాపూర్: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం సూరారం డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో రూ.48లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పురపాలక మంత్రి కేటీఆర్ సహకారంతో అభివృద్ధి పనులు నిరాటంకంగా కొనసాగాయని అన్నారు. అన్ని కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరచడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ కౌన్సిలర్ బొడ్డు వెంకటేశ్వర్ రావు, మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, డివిజన్ల అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్రా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి బండ, జొన్న బండలో ఎమ్మెల్యే పాదయాత్ర..

జీడిమెట్ల డివిజన్, కొంపల్లి మున్సిపల్ పరిధిలోని రంగారెడ్డి బండ, జొన్న బండ ప్రాంతాల్లో ఎమ్మెల్యే వివేకానంద్ మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం యాదవ్‌తో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తీల ప్రజలు ఎమ్మెల్యేకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, సంపత్ మాధవ్ రెడ్డి, గుమ్మడి మధుసూదన్ రాజు, మఖ్బూద్ అలీ, కాలే నగేష్, అనిల్, గణేష్, ఇందిరా రెడ్డి, బస్తీ వాసులు రామిరెడ్డి, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

పేదల అభ్యున్నతికి పాటు పడేది ఒక్క కాంగ్రెస్సే..


భగత్‌సింగ్‌నగర్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి

చింతల్: పేద, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడేది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన 200 మంది డివిజన్ ఇన్‌చార్జ్ రహమాన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పున్నారెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒకే నాణంపై ఉన్న బొమ్మ, బొరుసులాంటివని, ఒకరు మతాన్ని, మరొకరు స్థానికతను అడ్డం పెట్టుకుని ఓటర్లను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. తొమ్మిదేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏ-బ్లాక్ మహిళా వైస్ ప్రెసిడెంట్ ధనలక్ష్మి, నాయకులు కమలలాల్ మహమ్మద్, దండే రాజు, మండవ శివకుమార్, బాలు, బేకరీ గడ్డ ప్రెసిడెంట్ గఫర్, హనుమంతు, రమేష్, అన్వర్ తదితరులు ఉన్నారు.

దురలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలి

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న చాగంటి కోటేశ్వరరావు

నిజాంపేట్: సరైన ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఆత్మశౌచనం, శారీరక శుచితో సరైన ఆహారాన్ని తీసుకుంటే విద్యార్థులు తమను సరైన రీతిలో మలచుకోగలరని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సర విద్యార్థులకు ఆయన దైనందిన జీవితం, ప్రాపంచిక విషయాలపై ఉపదేశం చేశారు.

◆ ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. దురలవాట్లకు దూరంగా ఉండటం శ్రేయస్కరమని చెబుతూ విచక్షణ తెలియని అగ్నికి దూరంగా ఉండాలన్నారు. అది తమనేమీ చేయలేదని అనుకోవడం మూర్ఖత్వమని అన్నారు. మంట లక్షణం కాల్చి బూడిద చేయడమేనని తెలిపారు. నేటి ఆధునిక యుగంలో ఆధ్యాత్మికత, విజ్ఞాన శాస్త్రం అన్న రెండు పట్టాలలో ఒకదానిని కూడా వదలకుండా ప్రయాణం సాగిస్తే జీవితం సాఫీగా సాగుతుందన్నారు. తగిన అభిరుచులు, హాబీలను పెంపొందించుకోవడం సరైన క్రమశిక్షణ నేర్పిస్తుందని సలహా ఇచ్చారు.

◆ కష్టాలు అందరికి, అన్ని రంగాల్లో ఉన్న వారికి సహజమని, తారాస్థాయిని అందుకోలేకపోవడం తప్పు కాదన్నారు. కాని అందుకోవడానికి కంటూ ఉన్నతస్థాయి లేకపోవడం మాత్రం లోపమేనన్నారు. అమెరికా అధ్యక్షుడు అబ్రహాం లింకన్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌ల జీవితాలను ఉదహరిస్తూ వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 1400 మంది బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులతో పాటు అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బులు చెల్లించలేదని కూల్చేయడం అన్యాయం


జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

నిజాంపేట్: జీఓ.59 దరఖాస్తుదారుల ఇళ్లను డబ్బులు చెల్లించలేదనే నెపంతో కూల్చివేయడం అన్యాయని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో రెవెన్యూ అధికారులు చేపట్టిన కూల్చివేతలపై సీపీఐ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 15 సంవత్సరాలుగా ఇంటి పన్నులు చెల్లిస్తున్న వారి ఇళ్లను కూల్చివేశారన్నారు. ఒకే సర్వే నంబర్‌లో ఉన్న ఇళ్లకు వేర్వేరుగా డిమాండ్ నోటీసులు వచ్చాయని అన్నారు. పేదలకు లక్షల్లో డిమాండ్ నోటీసులు ఇస్తే ఎలా కడతారని ప్రశ్నించారు. గాజులరామరం సర్వే నం.326, 329, 342, 308లలో వెలిసిన అక్రమ నిర్మాణాలు ఎందుకు కూల్చడం లేదన్నారు. ఇళ్లు కూల్చివేసిన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాచుపల్లి మండల కార్యదర్శి శ్రీనివాస్, శ్రీనివాస్, ప్రభాకర్, ఇమామ్, గట్టయ్య, జగన్, చంద్రమోహన్, ప్రకాష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సొంతిల్లు ఉన్నోళ్లకి ఇళ్లు ఎలా కేటాయిస్తారు?

కుత్బుల్లాపూర్: డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సర్వే చేపట్టకుండానే కొంతమందికి కేటాయించడంపై పూర్తిస్థాయి విచారణ జరపాలని అపురూపకాలనీకి చెందిన కడియాల శైలజ సోమవారం కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నాగమణికి వినతిపత్రం అందజేశారు. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని ఓ మాజీ ప్రజా ప్రతినిధి అండతో సుమారు 10 మందికి సొంతిల్లు ఉన్నప్పటికీ వారి పేర్లను 500 మంది లిస్టులో ఉంచారన్నారు. స్వప్న, విశ్వకుమారి, మరాటి ఉష వీరికి ఇళ్లు ఉన్నప్పటికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. సదరు ఇళ్లను అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఉపకమిషనర్ సానుకూలంగా స్పందించి తప్పకుండా విచారణ జరిపి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఉచితంగా టెట్ నమూనా పరీక్ష

సికింద్రాబాద్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ అర్హత నమూనా పరీక్షను పరీక్ష (టెట్) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బి.తిరుపతిరెడ్డి తెలిపారు. టెట్ వన్, టూ గ్రాంగ్ టెస్టును ఆన్‌లైన్ పద్ధతిలో ఈ నెల 7వ తేదీ ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతిరెడ్డి కోరారు. మరింతా సమాచారం కోసం 9989913935 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

8మంది జూదరుల అరెస్టు

కుత్బుల్లాపూర్: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించగా ఎనిమిది మంది జూదరులు పట్టుబడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లిలోని మెయినుద్దీన్ గెస్ట్ హౌస్‌లో జూదం ఆడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.30,340 నగదు, ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. గుండ్లపోచంపల్లికి చెందిన వేణుగోపాల్, పోచమ్మగడ్డకు చెందిన ప్రవీణ్, కొంపల్లికి చెందిన కిషోర్, నాగిరెడ్డి, సాయినాథ్, సూరారం ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్, అంగడిపేట్‌కు చెందిన భరత్, మనోహర్ శరత్‌లపై కేసు నమోదు చేశారు.

బాత్‌రూమ్‌లో జారిపడి యువకుడు మృతి

కుత్బుల్లాపూర్: ప్రమాదశాత్తు బాత్‌రూమ్‌లో జారిపడిన యువకుడికి తలకు తీవ్ర గాయం కావడంతో మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చందన్ వాస్కేల్(18) సుభాష్‌నగర్‌లో ఉంటూ స్థానికంగా ఉన్న శ్రీబాలాజీ ఆటో ఏజెన్సీలో హెల్పర్, డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తీవ్ర చలిజ్వరంతో బాధ పడుతున్న చందన్ ఈనెల 3న బాత్‌రూమ్‌కు వెళ్లి జారి పడ్డాడు. ఇది గమనించిన తోటి పనివారు అతడిని రష్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు ఉద్యోగాలు సాధించడమే లక్ష్యంగా బోధిస్తున్నాం



మాట్లాడుతున్న కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి, హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

దుండిగల్: కళాశాలలో చేరిన విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎంఎల్ఆర్ఐటీ కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం ఓరియంటేషన్ డేను నిర్వహించారు. ఇప్పటి వరకు 15 వేలకు మందికి పైగా తమ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో ఉద్యోగాలు సాధించారన్నారు. బహుళజాతి సంస్థల్లో రూ.5 లక్షల నుంచి రూ.58 లక్షల వరకు వార్షిక ఆదాయం పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ అనుశ్రేయా రెడ్డి, కోశాధికారి మమతారెడ్డి, ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ రావు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నా


ప్రజా సమస్యలు వింటున్న ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని, ఇందులో భాగంగానే సీఎం కేసీఆర్ సారథ్యంలో బంగారు తెలంగాణ దిశగా రాష్ట్రం పయనిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

◆ చింతల్ పాపయ్యనగర్‌లో ఈ నెల 7న నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలకు రావాలని నిర్వాహకులు రాజశేఖర్‌యాదవ్ తదితరులు ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రికను అందజేశారు.

అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి


జీడిమెట్ల సీఐ పవన్‌కు ఫిర్యాదు చేస్తున్న గొల్లజాన్

జీడిమెట్ల: తనపై సోషల్ మీడియా ట్విట్టర్, ఇన్‌స్టాగామ్‌లో అసత్య ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లజాన్ జీడిమెట్ల సీఐ పవన్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం నుంచి కొంతమంది తెలుగు స్కాప్ పేరిట స్కోల్ చేస్తున్నారని తనను తట్టుకోలేక కళాశాల యాజమాన్యాన్ని అర్జీ ద్వారా బెదిరిస్తున్నట్లు స్కోల్ చేస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న తెలుగు స్కాప్ వారిని గుర్తించి వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని గొల్లజాన్ సీఐ పవన్‌కు కోరారు.

ఉత్సాహంగా టెడ్ఎక్స్



దుండిగల్: కఠోర శ్రమ, స్థితిస్థాపకత ద్వారా మన కలలను వాస్తవ రూపంలోకి మార్చుకోవాలని అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సర్జరీలో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ విమలాకర్ తెలిపారు. బౌరంపేటలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోమవారం టెడ్ఎక్స్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తన వ్యక్తిగత అంశాలతో పాటు జీవితంలో సాధించిన విజయాలపై స్ఫూర్తిదాయకమైన విషయాలను పంచుకున్నారు. రసవాదం అనేది నిరంతర స్వీయ పరివర్తన కళ అన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ ఆలోచనలను పంచుకున్నారు. కార్యక్రమంలో నటి మధుశాలిని, ప్రముఖ వెంచర్ క్యాపిటలిస్ట్ రేనాథన్, ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్, నోర్డ్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ ఇండియా ఎండీ క్రిస్టోఫర్ షార్ట్, విద్యార్థులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్‌లో భారీ వర్షం

వర్షాకాలం ఆరంభమైనా నెల రోజుల నుంచి వర్షం జాడ లేకుండా పోయింది. దీంతో వారం రోజులుగా వేసవికాలం మాదిరిగా ఉక్కపోతతో జనాలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు ఉపశమనం పొందారు. - సుభాష్‌నగర్

ఫుట్‌పాత్‌పై పార్కింగ్!


ఐడీపీఎల్ చౌరస్తాలో ఫుట్‌పాత్‌పై పార్కింగ్ చేసిన వాహనాలు

రంగారెడ్డినగర్: రోడ్డు విస్తరణలో భాగంగా లక్షలాది రూపాయల జీహెచ్ఎంసీ నిధులతో నిర్మించిన ఫుట్‌పాత్‌లు అక్కరకు రాకుండా పోతున్నాయి. ఐడీపీఎల్ చౌరస్తా సుందరీకరణలో భాగంగా ఇటీవల రోడ్డు విస్తరణ చేయడంతో పాటు జంక్షన్‌కు నలుదిక్కులా ఉన్న రోడ్ల వెంబడి బాటసారులు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్‌లను తీర్చిదిద్దారు. అయితే సమీపంలోని దుకాణ, వ్యాపార సముదాయాలకు వచ్చే కొనుగోలుదారులు ఫుట్‌పాత్‌లపై వాహనాలను నిలుపుతున్నారు. ఇంత జరుగుతున్నా అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది చోద్యం చూడటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.